క్లుప్తంగా

దాడిలో గాయపడిన నాగరాజును పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



నాగరాజును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

పెదపూడి: దౌర్జన్యంగా దాడులకు పాల్పడుతున్న కూటమి నేతలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లో ఉన్నాయని, తగిన మూల్యం చెల్లించక తప్పదని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి హెచ్చరించారు. మండలంలోని పైన గ్రామంలో కూటమి నేతల దాడిలో వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ పంపన నాగరాజు తీవ్ర గాయాలపాలై పెదపూడి సామాజిక ఆరోగ్యకేంద్రంలో చికిత్స పొందుతున్నాడు. అతనిని మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, పార్టీ నాయకులు ఆదివారం పరామర్శించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, మండల కన్వీనర్ గుత్తుల రమణ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మార్ని కామరాజుచౌదరి, పైన గ్రామ సర్పంచ్ సుందరపల్లి ప్రమీల, ఎంపీటీసీ సభ్యుడు సుందరపల్లి సుధాకర్, వేండ్ర గ్రామ సర్పంచ్ కోసూరి వాసు, పార్టీ నాయకులు చేవా సత్యనారాయణ, కాకర సాయిబాబు, దుర్గాప్రసాద్ పరామర్శించారు.

వామనావతారంలో భజేనారాయణస్వామి



వామనావతారంలో ఉన్న భజేనారాయణ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

రంగంపేట: మండలంలోని వడిశలేరు గ్రామంలో వేంచేసియున్న భజేనారాయణస్వామి వారి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకుని దశావతారాల్లో భాగంగా ఆదివారం స్వామివారిని వామనావతారంలో అలంకరించారు. ఆలయ అర్చకుడు చిలకమర్రి మురళీకృష్ణమాచార్యులు, శ్రీనివాసాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సర్వాంగ సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై వామనావతారంలో ఉన్న భజేనారాయణస్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సోమవారం పరశురామ అవతారంలో స్వామివారు దర్శనమిస్తారని ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి పి.ప్రియాంక తెలిపారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాసోత్సవాలు

మధురపూడి: కోరుకొండలో వేంచేసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, స్థానిక బస్‌స్టాండ్ సెంటర్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం ధనుర్మాసోత్సవాలు ఘనంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం తిరుప్పావై ప్రవచనాలు, భక్తుల గోత్రనామాలతో విశేష పూజలు, సేవాకాలం, తీర్థ ప్రసాదాల గోష్ఠి జరిగాయి. అలాగే గోదాదేవి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు.

గ్రామాల్లో సంక్రాంతి శోభ



హరిదాసుకు బియ్యం వేస్తున్న చిన్నారి

రంగంపేట: తెల్లవారక ముందే జంగమ దేవర శంఖారావం.. వెలుగు రేఖలు వచ్చేటప్పటికి శ్రీమద్రారమణ గోవిందో హరి అంటూ హరిదాసు నామస్మరణ.. డూ..డూ అంటూ బసవన్నల సందడితో గ్రామాల్లో సంక్రాంతి శోభ నెలకొంది. ధనుర్మాసంలో ప్రతి ఇంటి ముందూ రంగు రంగుల ముగ్గులు దర్శనమిస్తున్నాయి. దీనికితోడుగా చిన్నారులు గొబ్బెమ్మలతో సందడి చేస్తూ.. భోగి మంటల్లో దండలు వేయడానికి పిడకలు సిద్ధం చేసుకుంటూ హడావుడి చేస్తున్నారు. దీంతో పల్లెల్లో ఎటు చూసినా సంక్రాంతి శోభ కనిపిస్తోంది.

రేషన్ డీలర్ల భర్తీకి నోటిఫికేషన్

బిక్కవోలు: మండలంలో ఖాళీ అయిన రేషన్ డీలర్ల భర్తీకి నోటిషికేషన్ జారీ చేసినట్టు తహసీల్దార్ బి.సత్య వీర వెంకట కృష్ణ తెలిపారు. మండలం 7 రేషన్ డీలర్ పోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు. వాటిలో ఊలపల్లి గ్రామంలోని షాపు నంబర్ 07 (ఎస్సీ వుమెన్), ఊలపల్లి షాపు 08 (ఓసీ జనరల్), ఊలపల్లి షాపు 10 (ఓసీ మహిళ), రంగాపురం గ్రామంలోని షాపు 34(బీసీ-బి), రంగాపురం గ్రామంలోని షాపు 35 (ఎస్టీ-జనరల్), బిక్కవోలు ఆర్ఎస్‌పేట గ్రామంలోని షాపు 36 (ఓసీ-జనరల్), పందలపాకలోని షాపు 37 (ఎస్సీ -జనరల్)కు కేటాయించామని ఆయన వివరించారు. ఆసక్తి గల అర్హులు ఈ నెల 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఈ రోడ్లకు పల్లె పండగ లేదా?

- మరమ్మతులు లేక వెక్కిరిస్తున్న గోతులు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు



రాపాక - కోటికేశవరం రోడ్డు ఇలా..



రాజానగరం - కలవచర్ల రోడ్డు వర్షాలకు కొట్టుకుపోయి, గోతులు పడిన దృశ్యం

రాజానగరం: రాష్ట్రంలో గుంతలు పడిన రోడ్లకు సంక్రాంతి పండగ లోగా మరమ్మతులు చేసి, ప్రయాణికులకు గుంతలతో ఎదురవుతున్న ఇబ్బందులను తప్పిస్తామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటిస్తే, అంతా నిజమేననుకున్నారు. ముఖ్యంగా నియోజకవర్గంలో గోతులు పడిన రోడ్లకు మరమ్మతులు జరుగుతాయని అంతా ఆశించారు. కానీ సంక్రాంతి పండగ సమీపిస్తోందిగానీ రోడ్లకు మరమ్మతులు జరగకపోవడంతో ఈ హామీ కూడా సూపర్ సిక్స్ మాదిరిగానే భావించాలా? అని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పర్యాటకులకు చుక్కలు కనిపిస్తున్నాయి

నియోజకవర్గంలో సీతానగరం - పురుషోత్తపట్నం ఏటిగట్టు రోడ్డు మీదుగా పురుషోత్తపట్నం, రామచంద్రపురం, సింగవరం, వంగలపూడికి రాకపోకలు సాగించేవారే కాకుండా దిగువనున్న పోశమ్మ గండి ఆలయానికి నిత్యం వేలాదిమంది భక్తులు (పర్యాటకులు) రాకపోకలు సాగిస్తుంటారు. గోతులతో అస్తవ్యస్తంగా ఉండటంతో ఈ రోడ్డుపై ప్రయాణించే వారికి పగటి పూటే చుక్కలు కనిపిస్తున్నాయి.

ఈ ప్రాంతంలో ప్రయాణించడానికి ఆటోడ్రైవర్‌లు కూడా ముందుకురాని పరిస్థితులు నెలకొన్న తరుణంలో పల్లెపండగ పేరుతోనైనా గుంతలు పూడుస్తారనుకుంటే అదీ లేకుండా పోయిందని స్థానికులు నిరుత్సాహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇక సీతానగరం, చీపురుపల్లి, పెదకొండేపూడిలకు ఉన్న రోడ్డు గోతులు పడటమే కాకుండా మరమ్మతులకు నోచుకోక, పూర్వపు మట్టి రోడ్డును తలపించేలా తయారైంది. కాతేరు నుంచి సీతానగరం వెళ్లే రోడ్డు, రఘుదేవపురం, తొర్రేడు, మునికూడలి, కాటవరం రోడ్ల పరిస్థితులు కూడా ఈ మాదిరిగానే ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో వ్యవసాయ ఉత్పత్తులను ఎక్కువగా రవాణా చేసేందుకు కూడా ఈ రోడ్లనే వినియోగిస్తుంటారు. దీంతో రైతులు తమ పొలాలలో పండిన ఉత్పత్తులను బయటకు తరలించాలంటే నానా అవస్థలు పడకతప్పడం లేదు.

మరమ్మతులు చేయించండి

కోరుకొండ, రాజానగరం మండలాల్లో గాడాల నుంచి నిడిగట్ల, బూరుగుపూడి నుంచి దోసకాయలపల్లి రోడ్డుకు ఉన్న లింక్ రోడ్డు, నిడిగట్ల నుంచి పాలచర్ల మీదుగా దివాన్‌చెరువు రోడ్డు, నిడిగట్ల నుంచి వెలుగుబందకు వెళ్లే రోడ్డు, కనుపూరు నుంచి శింగరంపాలెం, కోటికేశవరం నుంచి నాగంపల్లి, రాపాక - కోటికేశవరం రోడ్డు, కలవచర్ల నుంచి మురారి రోడ్డు, కలవచర్ల నుంచి నరేంద్రపురం, వెలుగుబంద మీదుగా దివాన్‌చెరువు రోడ్డు, శ్రీరామపురం నుంచి ఫారెస్టు మీదుగా ఏపీ అప్పారావు జంక్షన్‌కి వెళ్లే రోడ్డు, కానవరం నుంచి పల్లకడియం, వీరంపాలెం వెళ్లే రోడ్లు మరమ్మతులకు నోచుకోక, ప్రయాణికుల సహనానికి పరీక్ష పెట్టేలా తయారవుతున్నాయి. ఇక వీటితోపాటు రాజానగరం జాతీయ రహదారి నుంచి కలవచర్ల, సీతారామపురం మీదుగా గాదరాడకు వెళ్లే రోడ్డు విస్తరణ పనులు అసంపూర్తిగా మిగిలిపోయి, చేసిన పనులు వర్షాలకు దెబ్బతిని, ప్రయాణికులకు నరకాన్ని చూపిస్తున్నాయి. అసంపూర్తిగా మిగిలిన పోయిన పనులను సత్వరమే పూర్తి చేసి, అవస్థలు తప్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అంతా ప్రచార ఆర్భాటమే



కల్లబొల్లి హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అంతా ప్రచార ఆర్భాటమేగాని, ప్రజలకు చేసిన మేలు ఏదీ లేదు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను అటకెక్కించిన ఈ పాలకులు పల్లె పండగ పేరుతో రోడ్లకు మరమ్మతులు చేస్తారంటే నిజమేనేమో అనుకున్నాం. కానీ అది కూడా నీటి మీది రాతలాంటిదేనని మరోసారి రుజువు చేశారు.

– అడబాల చినబాబు, రైతు నాయకుడు, సీతారామపురం

గోతులు పూడ్చండి బాబు



సంక్రాంతి పండగ అంటే తెలుగు లోగిళ్లలో ఎంతో సందడితో జరుపుకునేది. ఈ పండగకు దూరప్రాంతాల నుంచి అనేకమంది బంధువులు, కుటుంబ సభ్యులు వస్తుంటారు. ఈ సమయంలో రోడ్లన్నీ గోతుల మయంగా ఉంటే కూటమి సర్కారునే తిట్టుకుంటారు. సత్వరమే గోతులు పూడ్చించి, దూరం నుంచి వచ్చేవారి చీవాట్లు తినకుండా చూసుకోవాల్సిన బాధ్యత కూటమి నాయకులదే.

– దాట్ల రఘువర్మ, రైతు, కలవచర్ల

స్వామికి ఫలంకరణ



బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు గ్రామంలో కొలువైన ఉన్న శ్రీ లక్ష్మీనారాయణ స్వామిని పండ్లతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆదివారం అర్చకులు బిక్కవోలు రాఘవహర్షవర్ధన్, బిక్కవోలు రాఘవరాం స్వామి వారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆరెంజ్, దానిమ్మ, యాపిల్, ద్రాక్ష తదితర పండ్లు, పూలతో అలంకరణ చేశారు.

సూర్యనారాయణమూర్తి కల్యాణంపై సమావేశం



స్వామి కల్యాణంపై చర్చల్లో పాల్గొన్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు, యువత

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో ప్రసిద్ధి చెందిన సూర్యనారాయణమూర్తి స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించాలని ఉత్సవ కమిటీ ప్రతినిధులు నిర్ణయించారు. ఆదివారం సూర్యదేవాలయంలో స్వామి వారి కల్యాణం ఏర్పాట్లపై ఉత్సవ కమిటీ ప్రతినిధులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ ఫిబ్రవరి 8న ఉష, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యనారాయణమూర్తి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమానికి వివిధ పార్టీలకు చెందిన యువత, ముఖ్య నాయకులు హాజరయ్యారు. కల్యాణ ఉత్సవాలకు సంబంధించి బాణసంచా కాల్పులు, మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాలంకరణలు, బుట్టబొమ్మలు, శక్తి వేషాలు, డాన్స్ బేబీ డాన్స్ తదితర కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు.

హైందవ శంఖారావానికి తరలివెళ్లిన భక్తులు



హైందవ శంఖారావానికి వెళుతున్న పందలపాక వాసులు



జి.మామిడాడలో హైందవ శంఖారావం సభకు వెళ్లే బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

బిక్కవోలు: మండలం నుంచి 15 బస్సులపై హైందవ శంఖారావం సభకు ప్రజలు తరలి వెళ్లారు. ఆదివారం విజయవాడ విమానాశ్రయం సమీపంలో జరిగే బహిరంగ సభకు తరలివెళ్ళారు. బిక్కవోలు నుంచి మహిళలు ఎక్కువ సంఖ్యలో వెళ్లారు. పందలపాక, తొస్సిపూడి, కొమరిపాలెం నుంచి తరలి వెళ్లారు.

బస్సులకు జెండా ఊపిన ఎమ్మెల్యే

పెదపూడి: హైందవ సంస్కృతి పరిరక్షణకు అందరు కృషి చేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. విజయవాడలో కేసరపల్లి సమీపంలో విశ్వహిందూ పరిషత్–ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగే బహిరంగ సభకు బయలుదేరిన బస్సులకు జి.మామిడాడ గ్రామంలో జెండా ఊపి ప్రారంభించారు. ముందుగా స్థానిక సూర్యదేవాలయంలో స్వామి వారిని దర్శించుకున్నారు. ఆయన వెంట పలువురు ఎన్డీఏ నాయకులు ఉన్నారు.

తరలిన హిందువులు

రంగంపేట: విజయవాడ కేసరపల్లిలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న హైందవ శంఖారావానికి మండలం నుంచి జనం ఆదివారం తరలివెళ్లారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో ఉదయం 8 గంటలకే ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన బస్సులలో బయలుదేరారు. అనపర్తి నియోజకవర్గం నుంచి తరలివెళుతున్న 80 బస్సులను రంగంపేట మండలం ఎస్టీరాజాపురం గ్రామం వద్ద అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.

సీతానగరం మండలం నుంచి..

సీతానగరం: విజయవాడలో నిర్వహించే హైందవ శంఖారావం సభకు మండల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో హిందువులు తరలివెళ్లారు. ఆదివారం సీతానగరం మండల గ్రామాల నుంచి ప్రయివేట్ బస్‌లలో, అలాగే కారులు, ఆటోలు, ఆర్టీసీ బస్‌లపై అధిక సంఖ్యలో హిందువులు హైందవ శంఖారావం సభకు తరలివెళ్లారు. ప్రతి గ్రామం నుంచి అధిక సంఖ్యలో హిందువులు తరలివెళ్లడం ఇదే ప్రథమం. సమరసతా సేవా ఫౌండేషన్ మండల మహిళా కన్వీనర్ కె.అభిలాష ఆధ్వర్యంలో సీతానగరం నుంచి అధిక సంఖ్యలో హైందవ శంఖారావానికి హిందువులు తరలి వెళ్లారు. బస్‌లలో శ్రీరామ నామం జపిస్తూ, శ్రీరామ భజనలతో హిందువులు తరలివెళ్లారు. మండల గ్రామాల నుంచి సుమారు ఆరు వేల మందికి పైగా వెళ్లినట్టు సమాచారం

పేరుకుపోతున్న చెత్త

- భరించలేని దుర్వాసన
- ప్రగతికి నోచుకోని పల్లెలు



రాఘవపురం నుంచి కోటికేశవరం వెళ్లే రోడ్డు పక్కనే చెరువుకు చేర్చి వేసిన చెత్త

మధురపూడి: దేశానికి పట్టుగొమ్మలైన పల్లెల్లో చెత్త పేరుకుపోతోంది. కోరుకొండ మండలంలో 22 గ్రామాలు, 24 ఆర్‌బీకేలు ఉన్నాయి. జిల్లా పరిషత్, రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన 56 రోడ్లున్నాయి. ఈ రోడ్ల పక్కనే చెత్తవేయడంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. దుర్వాసన రావడంతో శ్వాస సంబంధిత రోగాల పాలవుతున్నారు. రాఘవపురం–కోటికేశవరం, రాఘవపురం–బొల్లెద్దుపాలెం రోడ్డుల్లో ఇరువైపులా చెత్తవేశారు. దోసకాయల పల్లి–నిడిగట్ల, మధురపూడి–తొర్రేడు, గాడాల–నిడిగట్ల రోడ్డు, గాదరాడ– నర్సాపురం, గాదరాడ–సీతారామపురం రోడ్లు చెత్తమయమయ్యాయి. పంచాయతీల్లో చెత్తను రోడ్డు పక్కనే వేయడంతో పేరుకుపోయింది. దీంతో ప్రజారోగ్యానికి రక్షణ లేకుండాపోయింది. అధికారులు పాలనాపరంగా ప్రజల ఆరోగ్య పరిరక్షణకోసం ఆలోచించడం లేదు. పంచాయతీ పాలకమండళ్లు కూడా దీన్ని గుర్తించకపోవడంతో సమస్య తీవ్రమయ్యింది. సమస్య పరిష్కారం నిమిత్తం ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని చెత్తను డంపింగ్ యార్డుల్లోనే వేసి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

దోషులపై కేసు నమోదు చేయాలి

సీతానగరం: గత నెల 31వ తేదీ అర్ధరాత్రి ముగ్గళ్ళ సెంటర్‌లో ఫ్లెక్సీ కడుతున్న టీడీపీ కార్యకర్తను కొంత మంది బ్లేడ్‌లతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన ఘటనలో తక్షణమే కేసు నమోదు చేయాలని, చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు పెందుర్తి అభిరామ్ కోరారు. ఆదివారం ముగ్గళ్ళలో బాధితుడు గెడ్డం అనిల్‌ను అభిరామ్ పరామర్శించారు. దాడి చేసిన వారిలో ఒకరిపై గతంలో క్రిమినల్ కేసులు ఉన్నాయని, పోలీసులపై నమ్మకంతో ఉన్నామని రోజులు గడిచినా విచారణ చేస్తున్నారే గాని తదుపరి చర్యలు పోలీసులు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ విషయమై మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువెళ్లానని, న్యాయం జరిగే వరకు పోరాడతామని టీడీపీ నాయకులు అభిరామ్ హెచ్చరించారు. ముగ్గళ్లలో టీడీపీకి చెందిన మరోవర్గం వారు దాడి చేశారని సమాచారం. చుండ్రు సత్యప్రసాద్, గద్దె సురేష్, చాపర్ల రాంబాబు, శివ, పెందుర్తి విజయ్ భాస్కర్ పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటకు డ్రోన్‌తో పిచికారీ



కత్తెర పురుగు నివారణ మందు పిచికారీ చేయడానికి డ్రోన్‌ను సిద్ధం చేస్తున్న దృశ్యం

సీతానగరం: మండలంలోని వెదుళ్లపల్లి రైతులకు సంబంధించిన మొక్కజొన్న పంటకు ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ సిబ్బంది ఆధ్వర్యంలో డ్రోన్ ద్వారా కత్తెర పురుగు నివారణ మందును ఆదివారం పిచికారీ చేశారు. ఏపీసీఎన్ఎఫ్ మాస్టర్ ట్రైనర్ ఎం.వరలక్ష్మి మాట్లాడుతూ 30 ఎకరాల్లో కత్తెర పురుగు నివారణకు సంబంధించి వేప గింజల కషాయం, ఇంగువ, అగ్నిహస్త్రంను డ్రోన్ ద్వారా పిచికారీ చేశామన్నారు. డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ డి.తాతారావు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. మొక్కజొన్నకు కత్తెర పురుగు పట్టి రైతులు విపరీతంగా నష్టపోతున్నారని, దాని నివారణకు, కత్తెర పురుగు ఆశించకుండా ఈ మందు ఉపయోగపడుతుందన్నారు. ఏపీసీఎన్ఎఫ్ యూనిట్ ఇన్‌చార్జి శ్రీనివాస్, ఐసీఆర్‌పీ (ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్) నాగదేవి, ప్రవీణ్‌కుమార్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మహాభాగవత ప్రవచనం

అనపర్తిలో ఘనంగా మూడో రోజు జరిగిన త్యాగరాజ ఆరాధన ఉత్సవాలు



మహాభాగవతం ప్రవచనం చేస్తున్న నాగఫణిశర్మ

పెదపూడి: అనపర్తి శారదా సంగీత కళా సమితి 26వ త్యాగరాజు ఆరాధన ఉత్సవాల మూడో రోజు ఆదివారం ఆంధ్ర మహాభాగవతంపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. మహాకవి, అవధాన సహస్రఫణి, అవధాన సరస్వతి పీఠం అధ్యక్షుడు బ్రహ్మశ్రీ డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ చేసిన ఆధ్యాత్మిక ప్రవచనం అందర్ని ఆకట్టుకుంది. ఆంధ్ర మహాభాగవతం నుంచి ముఖ్య ఘట్టాలను శ్రోతుల కళ్లకు కట్టినట్టు వివరించారు. రుక్మిణి కల్యాణ ఘట్టాన్ని వివరిస్తూ భగవంతుడైన శ్రీకృష్ణుణ్ణి రుక్మిణీదేవి ఏ విధంగా ప్రార్థించి వివాహం చేసుకుందో వివరించారు. పోతన పద్యాలను చక్కగా వివరించారు. భగవంతుని అనుగ్రహం మేరకు మహాభాగవతం ఆంధ్రీకరించానని, తన సొంత ప్రయత్నం లేదని పోతన చెప్పిన విధానాన్ని నాగఫణిశర్మ ఆద్యంతం అందరినీ ఆకట్టుకునే విధంగా తెలిపారు. మధ్యాహ్నం టీటీడీ కల్యాణ మండపంలో ఉమా రామలింగేశ్వర వేద శాస్త్ర పరిషత్ 32వ వార్షికోత్సవం సందర్భంగా వేద సభ నిర్వహించారు. బ్రహ్మశ్రీ ఉప్పులూరి సత్యనారాయణ అవధాని అధ్యక్షతన వేద పండితులు సుమారు మూడు గంటల పాటు వేద గోష్ఠి నిర్వహించారు. దీంతో అనపర్తి గ్రామం వేద ఘోషతో నిండిపోయింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్రి రామారెడ్డి హాజరవ్వగా వి.వి.తిలక్‌కుమార్ సౌజన్యంతో నిర్వహించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు తమలంపూడి చిన్న ఆదిరెడ్డి, ఉపాధ్యక్షుడు నల్లమిల్లి మురళీమోహన్ బాలకృష్ణారెడ్డి, సమితి సభ్యులు కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, మార్నేళ్ల ఫణి కుమార్, కె.వెంకటరెడ్డి, కర్రి వెంకటరామ కృష్ణారెడ్డి, పాలి ఆంజనేయులు, మునీశ్వర్‌రెడ్డి, అశోక చక్రవర్తి, పాల్గొన్నారు.

అన్నయజ్ఞం దాతకు సత్కారం



దాతను సత్కరిస్తున్న డాక్టర్ వీర్రెడ్డి

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు గ్రామంలో గత ఏడు సంవత్సరాలుగా అన్న యజ్ఞం పేరుతో అనాథలకు , రోగులకు, దివ్యాంగులకు ప్రతిరోజు భోజనం అందిస్తున్నారు. ఆదివారం దాతలను కాకినాడ శ్రావణి హాస్పిటల్ అధినేత సత్తి వీర్రెడ్డి ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాల్లో ఉన్న దాతల సహకారంతో ప్రతి రోజు 40 మందికి భోజనం ఇంటికే పార్సిల్ చేసి అందించడం చాలా ఆనందాయకం అన్నారు. అన్న యజ్ఞంలో నిర్వహించిన వెలగల శ్రీనివాసరెడ్డిని సత్కరించారు.

13 నుంచి దోసాలమ్మ సంక్రాంతి ఉత్సవాలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు గ్రామదేవత దోసాలమ్మ అమ్మవారి సంక్రాంతి ఉత్సవాలు ఈ నెల 13వ తేదీ నుంచి 15 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. 13వ తేదీ భోగిరోజున అమ్మవారికి ప్రత్యేక పూజలు, సాయంత్రం భజన కార్యక్రమం, 14వతేదీ సంక్రాంతి రోజున ప్రత్యేక పూజలు, సాయంత్ర కచేరి, 15వ తేదీ కనుమ రోజున ఉదయం అమ్మవారి పంచలోహ విగ్రహం ఉయ్యాలసేవ, సాయంత్రం అమ్మవారి పంచలోహ విగ్రహం ఊరేగింపు జరుగుతుందన్నారు.

రిటైర్డ్ ఉద్యోగికి సన్మానం



అబ్బులు దంపతులను సన్మానిస్తున్న డివిజన్ సూపరింటెండెంట్ శేషారావు

రాజానగరం: ఉద్యోగం ఏదైనా అంకిత భావంతో విధులు నిర్వర్తించే వ్యక్తులు జనంలోకాదు, సహచరులలో కూడా పదికాలాల పాటు గుర్తుంటారని భారతీయ తపాలా శాఖ, రాజమహేంద్రవరం డివిజన్ సూపరింటెండెంట్ శేషారావు అన్నారు. స్థానిక పోస్టాఫీసులో డాక్ సేవక్‌గా 43 సంవత్సరాలపాటు సుదీర్ఘమైన సేవలందించి, పదవీ విరమణ చేసిన ప్రత్తి అబ్బులును ఆదివారం సన్మానించారు. పోస్టాఫీసు ఆవరణలో జరిగిన కార్యక్రమంలో అబ్బులు దంపతులను సూపరింటెండెంట్‌తోపాటు రాజమహేంద్రవరం హెడ్‌పోస్టు మాస్టర్ సువర్ణరాజు, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ సెక్రటరీ శ్రీనివాస్, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు టీఎస్ఎన్ రెడ్డి, తాతాజీ, హనుమాన్, భాస్కర్, అశోక్, సుందరరాజు, భూలోకం, రమణ స్కూల్ మేట్స్, బంధువులు సన్మానించారు. గండేపల్లి పోస్టుమాస్టర్ లింగయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాజానగరం, గండేపల్లి, జీఎస్ఎల్ కాలేజీలలోని సబ్‌పోస్టాఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

అబ్బురపరచిన ఆంధ్రా అందాలు

సినీనటి రేణూదేశాయ్



రాజానగరం: ఆంధ్రాలోని ప్రకృతి రమణీయత గురించి ఇంతకాలం వినడమేగానీ స్వయంగా చూసే అవకాశం రాలేదు. అంటే రోడ్డు మార్గంలో ఇంతవరకు ప్రయాణించే అవకాశం రాలేదు. కానీ శనివారం విజయవాడ నుంచి రాజమహేంద్రవరానికి రోడ్డు మార్గాన వస్తూ దారిలో ఉన్న అరటి, కొబ్బరి తోటలతోపాటు వరి పొలాలను చూసి ఎంతో మధురానుభూతిని పొందాను. ఆంధ్రప్రదేశ్‌ని అన్నపూర్ణగా ఎందుకు అంటారో ఇప్పుడు అర్థమైంది. ఇక్కడ ఉంటున్న వారు ఎంతటి అదృష్టవంతులో కదా అనిపించింది అంటూ సినీ నటి రేణు దేశాయ్ తన మనసులోని మాటను వెల్లడించారు. రాజానగరం మండలం, నరేంద్రపురంలో ఒక ప్రయివేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఇక్కడకు వచ్చిన ఆమె ఆదివారం స్థానిక మీడియాతో మాట్లాడారు. ఈ సమయంలో ఆమె కుమారుడు అకిరా నందన్ సినీరంగ ప్రవేశం ఎప్పుడని అడిగిన ప్రశ్నకు బదులిస్తూ మీ అందరికంటే ఆతృతతో కన్న తల్లిగా తాను కూడా ఆ సమయం కోసం ఎదురు చూస్తున్నానన్నారు. అతని అభీష్టం మేరకే నిర్ణయం ఉంటుందన్నారు.